
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
మంగళవారం 9 సెప్టెంబరు 2025




మొక్కను నాటుతున్న సీపీ అనురాధ

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

● సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని నేటి మొక్కలే రేపటి వృక్షాలని సీపీ అనురాధ జిల్లా పోలీసు అధికారులకు సిబ్బందికి సూచించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం వన మహోత్సవంలో భాగంగా ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. పరిశుభ్రత, పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కలు చాలా ముఖ్యమన్నారు. అందులో భాగంగా కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా పోలీస్ అధికారులు సిబ్బందితో కలిసి 600 మొక్కలు నాటడం జరిగిందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. నాటిన ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుషాల్కర్, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ , ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, మొగిలి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



● పెన్షన్ పెంపుపై ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచి, తమ మాటను నిలబెట్టుకోవాలని వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ. 4వేలు పెన్షన్ పెంచి ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా 'చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా ఈ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ధర్నాలో వీహెచ్‌పీఈఎస్ నేతలు దండు శంకర్, చిట్టెల సంపత్, మంద కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి)



● సూచన సరే.. మరి రక్షణ ఎప్పుడు?

సిద్దిపేటలోని బీజేఆర్ చౌరస్తాలో ఇటీవల జరిగిన ప్రమాదం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. డివైడర్‌ను ఢీకొని ఓ బైకర్ మృతి చెందిన ప్రాంతంలో 39 వార్డు కౌన్సిలర్ దీప్తి నాగరాజు "నెమ్మదిగా వెళ్లండి" అని సూచిస్తూ ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఈ సూచన మాత్రమే సరిపోదని ఇక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. తగిన రక్షణ చర్యలు చేపట్టకపోతే మరిన్ని విషాదాలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మాస్టర్ ప్లాన్‌కు నోచుకోని 'మల్లన్న'

● ఇటీవల పలు ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ ● కొమురవెల్లికి దక్కని చోటు



కొమురవెల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆలయాల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌లను రూపొందించి నిధులు కేటాయిస్తోంది. అయితే ఉత్తర తెలంగాణలో రెండో శ్రీశైలంగా పేరుగాంచిన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఈ మాస్టర్ ప్లాన్‌లో చేర్చకపోవడం భక్తులను, స్థానికులను నిరాశకు గురిచేస్తోంది. ఆలయాన్ని మాస్టర్‌ప్లాన్‌లో చేర్చి, సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు మల్లన్నను దర్శించుకుంటారు. హుండీ కానుకలు, టెండర్ల ద్వారా ఆలయానికి ఏటా రూ. 22 కోట్ల ఆదాయం సమకూరుతోంది. డిప్యూటీ కమిషనర్ స్థాయి ఆలయంగా గుర్తింపు పొందిన ఈ దేవాలయాన్ని మాస్టర్ ప్లాన్‌లో చేర్చడం అత్యంత అవశ్యకమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రులు చొరవ తీసుకోవాలి

2011లో ఆలయ అభివృద్ధి కోసం అధికారులు సమగ్ర నివేదికతో కూడిన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. కానీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కొమురవెల్లి మల్లన్న ఆలయం అభివృద్ధికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సిద్దిపేట జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన కొండా సురేఖ, మల్లికార్జున స్వామిని ఇలవేల్పుగా కొలుస్తారు. ఈ ముగ్గురు మంత్రులు కలిసి ఆలయాన్ని మాస్టర్ ప్లాన్‌లో చేర్చేందుకు కృషి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆలయాభివృద్ధిపై ప్రభుత్వం వివక్ష

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకగా, అత్యంత చారిత్రక ప్రాశస్త్యం పొందిన కొమురవెల్లి మల్లన్న ఆలయాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష వహిస్తుండడం తగదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని ప్రధాన ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ అమలుకు చర్యలు తీసుకున్నప్పటికీ కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని చేర్చకపోవడం తగదన్నారు. యేటా మల్లన్న ఆలయం నుంచి రూ.6కోట్ల మేర సీజీఎం రూపంలో ప్రభుత్వం పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ గుర్తించకపోవడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆధ్యాత్మికతకు గర్వకారణమైన ఆలయాన్ని విస్మరించడం సిగ్గుచేటన్నారు. ప్రజల విశ్వాసానికి, భక్తుల మనోభావాలు కాలరాస్తున్న ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మల్లన్న ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధిపరిచామని, కాంగ్రెస్ ఏడాదిన్నరపాలనలో కనీస వసతుల కల్పనతో పాటు ఉత్సవాల నిర్వహణలో ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మల్లన్న ఆలయాన్ని మాస్టర్‌ప్లాన్‌లో చేర్చాలని, లేదంటే సహించబోమన్నారు.

ఫైనాన్సెన్స్!



● ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుని వడ్డీ దందాలు
● అప్పు ఇచ్చేటప్పుడు ఒక మాట, తీర్చేటప్పుడు మరో మాట
● వడ్డీ కట్టలేక నానా తంటాలు పడుతున్న అన్ని వర్గాలు
● అక్రమ ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వడ్డీ వ్యాపారులు పెట్రేగిపోతున్నారు. అక్రమ ఫైనాన్స్ దందాలతో అమాయకులను నిలువునా ముంచేస్తున్నారు. అత్యవసరాల కోసం అప్పు తీసుకున్న వారి నుంచి ఆస్తులు రాయించుకుని, ఇష్టానుసారంగా వడ్డీలు వసూలు చేస్తూ బాధితులను పీల్చి పిప్పి చేస్తున్నారు. వడ్డీ కట్టలేక కొందరు తమ ఆస్తులు కోల్పోతుంటే, మరికొందరు ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. ఈ దందాలను అరికట్టాలని బాధితులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భూములు రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు

సాధారణంగా ఫైనాన్స్ కంపెనీలు మధ్యవర్తుల ద్వారా జామీను, బాండ్ పేపర్లపై హామీ తీసుకుని, చెక్కుల ద్వారా అప్పులు ఇచ్చేవి. అయితే, ఇటీవల కొంతమంది వ్యాపారులు అప్పుల బాధ భరించలేక తమ ఆస్తులను బంధువుల పేరు మీద మార్చుకుని, ఐపీలు తీసుకుంటుండడంతో ఫైనాన్స్ వ్యాపారులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. అప్పులు ఇచ్చే ముందుగానే నేరుగా బాధితుల ఆస్తులను తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అప్పు వడ్డీతో సహా తీర్చిన తర్వాతే తిరిగి బాధితులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అయితే ఇందులోనూ మోసాలు జరుగుతున్నాయి. కొందరు అగ్రిమెంట్ పేపర్లు రాసుకుని అప్పులిస్తుంటే, మరికొందరు ఏ అగ్రిమెంట్ లేకుండానే ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అప్పు తీర్చే సమయానికి ఎక్కువ వడ్డీలు వేసి బాధితులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

బాధితుల్లో పేద, బడా బాబులు

వడ్డీ వ్యాపారుల వలలో చిక్కుకుని నష్టపోయిన వారిలో పేదవారు, మధ్యతరగతి వారితో పాటు బడా బాబులు కూడా ఉన్నారు. సిద్దిపేటకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి కరోనా సమయంలో వ్యాపారంలో నష్టం రావడంతో డబ్బులు అవసరమయ్యాయి. దీంతో తన ఆస్తిని ఓ వడ్డీ వ్యాపారికి రిజిస్ట్రేషన్ చేసి అప్పుగా తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత అప్పు తీర్చేందుకు వెళ్లగా, అధిక వడ్డీ చెప్పడంతో బాధితుడు కంగుతిన్నారు. గట్టిగా అడిగితే "నా పేరు మీద రిజిస్ట్రేషన్ ఉంది, ఏం చేసుకుంటావో చేసుకో" అని వ్యాపారి బెదిరించడంతో ఆ వ్యాపారవేత్త చేసేదేమీ లేక మదనపడుతున్నారు. సిద్దిపేటకు చెందిన మరో వ్యాపారి కూడా తన ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసి డబ్బులు తీసుకున్నారు. తీర్చే సమయానికి వడ్డీ వ్యాపారి మాట మార్చి ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయడంతో ఆ వ్యాపారి దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పరువు పోతుందనే భయంతో ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

గుండెపోటుతో వ్యాపారి మృతి!

దుబ్బాక మండలానికి చెందిన ఓ వ్యాపారికి రియల్ ఎస్టేట్‌లో నష్టం రావడంతో తన అప్పులు తీర్చేందుకు ఒక వడ్డీ వ్యాపారి వద్ద తన ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసి డబ్బులు తీసుకున్నారు. అయితే, వడ్డీ వ్యాపారి ఆ అప్పులు తీర్చకుండానే, ఇంకా ఎక్కువ ఆస్తులు తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలంటూ వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు భరించలేక తీవ్ర మానసిక ఆవేదనకు గురైన ఆ వ్యాపారి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిసింది.

ఏజెంట్ల ద్వారా అప్పుల దందా

కొంతమంది వ్యాపారులు తమ వద్ద ఉన్న నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి ఏజెంట్ల ద్వారా ఫైనాన్స్ దందాలు నడిపిస్తున్నారు. ఈ ఏజెంట్లు వ్యాపారంలో నష్టపోయినవారు, డబ్బుకు ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, తక్కువ వడ్డీకి అప్పు ఇప్పిస్తామంటూ తమ ఫైనాన్సర్ల

మిగతా 8వ పేజీలో

ప్రజావాణికి 168 దరఖాస్తులు

సిద్దిపేటకల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. మొత్తం 168 దరఖాస్తులు అందాయి. ప్రజలకు జిల్లా యంత్రాంగంపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి అధికారి తమ శాఖకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమ అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ పాలన అధికారుల (వీఆర్‌వోల) కౌన్సెలింగ్ ప్రక్రియను కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, జిల్లాలో మిగిలిపోయిన వీఆర్‌వోల పోస్టుల కోసం ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో భాగంగా గతంలో వీఆర్ఏలుగా పనిచేస్తూ, ఆ తర్వాత జూనియర్ అసిస్టెంట్ లేదా రికార్డు అసిస్టెంట్‌లుగా క్రమబద్ధీకరించబడిన 91 మందికి అత్యంత పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి, వారికి వివిధ గ్రామాల్లో గ్రామపాలన అధికారులుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంపికైన వారంతా అదనపు బాధ్యతలతో గ్రామ పాలన అధికారులుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె ఆదేశించారు.


మెదక్-సిద్దిపేట రోడ్డు పై యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా బాధలు.. రోడ్డెక్కిన రైతులు

● గంటల తరబడి నిరీక్షించినా పంపిణీ లేక ఆగ్రహం.. ధర్నాలు 7

డంపింగ్ యార్డును తక్షణమే ఎత్తివేయాలి

సిద్దిపేటరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామశివారులో డంపింగ్ యార్డు, బయో గ్యాస్ ప్లాంట్‌ను తక్షణమే తొలగించాలని సిద్దిపేటరూరల్ మండలం బుస్సాపూర్, తొగుట మండలం వర్దరాజుపల్లి గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేశారు. సోమవారం బుస్సాపూర్ శివారులోని డంపింగ్‌యార్డుకు అడ్డంగా టెంట్ వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల భూగర్భజలాలు కలుషితమవుతాయన్నారు. ఇరు గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. చెరువులో నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని, ఆ నీటిని తాగిన పశువులు సైతం రోగాల బారిన పడి చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రులకు సంబంధించిన వ్యర్థాలను కుక్కలు పొలాల్లోకి తీసుకొస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో సదానందం, ఏసీపీ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ స్వామి, రూరల్ సీఐ శ్రీనులు రైతులు, గ్రామస్థులతో మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికి సమస్యను కలెక్టర్‌కు వివరిస్తామని వెల్లడించారు. ఆర్డీవో, తహసీల్దార్, ఫిషరీస్ అధికారులతో కమిటీ వేసి రేపు పూర్తిస్థాయి నివేదిక అందజేస్తామని తెలిపారు.


ఇరు గ్రామాల వారితో మాట్లాడుతున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా..

● ఆర్టీసీ డ్రైవర్ల సెల్‌ఫోన్లు డిపోలో డిపాజిట్
● సంగారెడ్డి డిపోలో ప్రయోగాత్మకంగా అమలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో భాగంగా ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విధుల్లోకి చేరే ముందు డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 రీజియన్ల నుంచి ఒక్కో డిపోను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. అందులో మెదక్ రీజియన్ నుంచి సంగారెడ్డి డిపోను ఎంపిక చేశారు.

డ్రైవర్లు విధుల్లోకి వెళ్లే ముందు తమ సెల్‌ఫోన్‌ను డిపోలోని సెక్యూరిటీ అధికారికి అప్పగించాలి. సెక్యూరిటీ సిబ్బంది డ్రైవర్ల పేరు, ఫోన్ నంబరు, చిరునామా, సెల్‌ఫోన్ మోడల్ వివరాలు నమోదు చేసుకొని, వారికి ఒక టోకెన్ ఇచ్చి సెల్‌ఫోన్‌ను డిపాజిట్ బాక్సులో భద్రపరుస్తారు. డ్యూటీ ముగిశాక, డ్రైవర్లు టోకెన్ ఇచ్చి తమ ఫోన్‌ను తిరిగి తీసుకోవాల్సి ఉంటుంది. అత్యవసర సమాచారం ఏదైనా తెలియజేయాల్సి వస్తే, డ్రైవర్‌తో పాటు వెళ్లే కండక్టర్ సెల్‌ఫోన్ నంబరును సెక్యూరిటీ రిజిస్టర్‌లో రాసుకుంటారు. అత్యవసర సమయంలో కండక్టర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తారు. సంగారెడ్డి డిపో పరిధిలో ప్రస్తుతం 160 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు.


సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో సెల్‌ఫోన్ డిపాజిట్ చేస్తున్న డ్రైవర్

ప్రయాణికుల భద్రత కోసమే

ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగారెడ్డి డిపోలో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. డ్రైవర్లు పూర్తిగా సహకరిస్తున్నారు. ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన నేపథ్యంలో ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- పి. ఉపేందర్, డీఎం, సంగారెడ్డి డిపో

అర్ధరాత్రి కారు బీభత్సం


ధ్వంసమైన కారు

రామాయంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగం.. అజాగ్రత్తగా కారు నడపగా రోడ్డు పక్కన ఉన్న పానీ పూరి బండి ధ్వంసమైంది. అంతటి వేగానికి పగటిపూట అయితే ప్రాణాలే పోయేవి. అర్ధరాత్రి కావడంతో జన సందడి లేక పెను ప్రమాదం తప్పినట్లైంది. కామారెడ్డి వైపు నుంచి పాత హైవేపై సిద్దిపేట చౌరస్తాలో ఉన్న ఓ హోటల్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారు నడుపుతున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కారును తొలగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కస్తూర్బాలో వైరల్ ఫీవర్..!

ఝరాసంగం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఝరాసంగం కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని పలువురు విద్యార్థినులు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కరుణకుమార్ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీ చేపట్టారు. అక్కడ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న విద్యార్థినులను ఆయన పలకరించారు. స్థానిక వైద్యాధికారికి ఫోన్ చేసి విషయం చెప్పి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించారు. పాఠశాల ఆవరణలో గల డ్రైనేజీ నుంచి విపరీతమైన దుర్గంధం వెదజల్లడంతో ఆయన ప్రత్యేక అధికారి పనితీరుపై ఆగ్రహం చెందారు. పాఠశాలలోని స్టోర్ రూంలో నిల్వ ఉంచిన కూరగాయలు, అరటి పండ్లకు దోమలు, ఈగలు వ్యాప్తి చెందడం చూసి పిల్లలకు ఇలాంటి ఆహారం అందజేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా విద్యార్థినులకు అందజేసే బియ్యంలో తెల్లని పురుగు కనిపించడంతో మండిపడ్డారు. అడిగిన వాటికి సరైన సమాధానం ఇవ్వకుండా పొంతన లేని సమాధానలు ఇవ్వడం సరికాదన్నారు. ఇక్కడి పరిస్థితులపై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తానన్నారు. ఈ విధమైన ఆహారం అందజేయడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రత్యేక అధికారి పనితీరుపై సీపీఎం నాయకులు చంద్రన్న జిల్లా అధికారులకు సమాచారం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐలు రామరావు, సాయికుమార్‌లు ఉన్నారు.


పాఠశాల ఆవరణలో గల డ్రైనేజీని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లయ్య సేవలు చిరస్థాయిగా మిగిలిపోతాయి


ప్రసంగిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్

భెల్‌కాలనీ,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనకు అహర్నిశలు కృషి చేసిన పోరాటయోధుడు ఎల్లయ్య సేవలు బీహెచ్‌ఈఎల్ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతాయని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు, బీహెచ్‌ఈఎల్ సీనియర్ కార్మిక నాయకుడు జి.ఎల్లయ్య మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ సోమవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు రెహమాన్ అధ్యక్షతన సంతాపసభను నిర్వహించగా, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ యాదవ్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ, పరిశ్రమ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన ఎల్లయ్య జ్ఞాపకార్థం భెల్ చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అధికార కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు కృష్ణంరాజు ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింలు, సీనియర్ కార్మిక నాయకులు దామోదర్‌రెడ్డి, జాషువా, బాలకిష్టయ్య, వలీఉద్దీన్, కొండారెడ్డి, జాషువా తదితరులు ఎల్లయ్య సేవలను గుర్తుచేసుకుంటూ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, నాయకులు గంగాధర్, శ్రీరాములునాయక్, శ్రీధర్, రాజేందర్ తదితరులతో పాటు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

షో కాజ్ నోటీసులు ఇచ్చారంటూ..

● 'డబుల్'' లబ్ధిదారుల ధర్నా

జోగిపేట, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ధర్నాకు దిగిన ఘటన సోమవారం జోగిపేటలో చోటుచేసుకుంది. అధికారులు రెండేళ్ల క్రితం అందోలు, జోగిపేట జంట పట్టణాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. అయితే, కొందరు లబ్ధిదారులు.. తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులకు అమ్ముకోగా, మరి కొందరు ఇతరులకు అద్దెకిచ్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి.. దీంతో ఆర్డీవో అధికారులు పలువురు లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చారు. మీకు కేటాయించిన డబుల్ ఇళ్లల్లో మీరు ఉండడంలేదని, ఇతరులు ఉంటున్నారని అంటూ, మూడు, నాలుగు రోజుల్లోగా సరైన కారణాలు తెలపాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మీకు కేటాయించిన ఇళ్లను మేము వెనక్కి ఎందుకు తీసుకోకూడదో తెలపాలంటూ షో కాజ్ నోటీసులు ఇచ్చారు. ఈక్రమంలో పలువురు లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, మెమోరాండం సమర్పించేందుకు కార్యాలయం లోపలికి వెళ్లారు. అయితే మంత్రి పర్యటన ఉన్న కారణంగా అధికారులెవరూ లేకపోవడంతో వెనుదిరిగారు. తాము ఇంట్లో లేకుండా పనికి వెళ్లినప్పుడు అధికారులు ఎంక్వయిరీ చేసి నోటీసులు అతికించారని వారు మండిపడ్డారు. వెంటనే అధికారులు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ జిల్లా నాయకుడు పీ.నా రాయణ, సీపీఎం డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్...వీరికి సంఘీభావం గా ధర్నాలో పాల్గొన్నారు..

షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చిలప్‌చెడ్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): షాట్ సర్క్యూట్ తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామ పంచాయతీ కొత్తకుంట తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకి చెందిన బానోత్ రమేష్ ఇంట్లో ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్ అవడంతో ఇంట్లో నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, బీరువాలో సామాన్లు, వస్తువులు, తినుబండరాలు ,నాలుగు క్వింటాల బియ్యం, దుస్తులు,రూ.13వేల రూపాయలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలను గమనించిన తండావాసులు నీటితో మంటలను చల్లార్చారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో రమేష్ కుటుంబం కట్టుబట్టలతో బయటే ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు, విద్యుత్ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించిన ఆర్ఐ సునీల్ చౌహాన్ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామని తెలిపారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు


ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సూరంపల్లిలో కూలిన బొల్లం లక్ష్మి ఇల్లు

దౌల్తాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసలే నిరుపేద కుటుంబం ఆపైన ఆర్థిక ఇబ్బందులు ఇంతలో ఆ కుటుంబం నివాసం ఉండే పాత ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన బొల్లం లక్ష్మి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. బొల్లం లక్ష్మి- బొల్లం పోచయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పోచయ్య కొద్ది సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. లక్ష్మికి ఎలాంటి ఆస్తిపాస్తులు, వ్యవసాయ భూమి లేదు. ఆమె కూలి పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. అసలే రెక్కాడితేనే కానీ పూట గడవని కుటుంబానికి భారీ వర్షాలతో తలదాచుకునే పాత ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లుకు దరఖాస్తు చేసుకున్న పాత ఇల్లు ఉందని ఆ కుటుంబానికి ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించలేదు. రోడ్డున పడ్డ లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం , ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, చొరవ తీసుకొని ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని వేడుకుంటున్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

● త్రుటిలో తప్పి ప్రమాదం


గ్యాస్ సిలిండర్ పేలడంతో పూరిగా శిథిలం అయిన ఇల్లు

కౌడిపల్లి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలడంలో త్రుటిలో 20 మందికి ప్రాణాపాయం తప్పిన సంఘటన సోమవారం మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ తల్లి మార్చి 2025లో మృతి చెందింది. దీంతో సోమవారం బంధు మిత్రులతో కలిసి నెల తద్దినం సోమవారం ఏర్పాటు చేసుకొని వంటచేశారు. వంట చేసే సిలిండర్‌తో పాటు అదనంగా ఇంట్లో తెచ్చి పెట్టుకున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇల్లుతో పాటు ఇతర సామగ్రి పేలిపోవడం, 20 మంది బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు త్రుటిలో ప్రాణాపాయం నుండి బయట పడ్డారు. నర్సాపూర్‌లోని అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకుని మంటలను ఆర్పివేశారని అన్నారు. కౌడిపల్లి అర్ఐ శ్రీహరితో పాటు పోలిసులు సంఘట స్థలంకు చేరుకుని విచారణ చేపట్టారు

జీవో 99ని సవరించాలని ఆందోళన


హుస్నాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు నాయకుల ఆందోళన

హుస్నాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబర్ 99ని సవరించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయాన్ని మాల మహానాడు నాయకులు ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ హాజరయ్యారు. దీనికి ముందు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా మంత్రి క్యాంపు కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడ జీవో 99 ప్రతులను దహనం చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం తీసుకవచ్చిన జీవో 99 రోస్టర్ విధానం ద్వారా మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో తీవ్ర నష్టం జరుగుతుందని, జీవో 99 సవరణ చేసి రోస్టర్ పాయింట్ 22 నుంచి 16కు తగ్గించాలని డిమాండ్ చేశారు.

యువకుడి హత్య : ఇంటి ముందు మృతదేహం


జయప్రకాష్(ఫైల్)

పటాన్‌చెరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని ఇంటి ముందు పడేసిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కల్కిబోయ్ గ్రామానికి చెందిన జయప్రకాష్ (22) రెండేళ్లుగా ఐడీఏబొల్లారం పురపాలక పరిధి కేటీఆర్ కాలనీలో తల్లి రాధతో కలిసి ఉంటూ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మోటారుసైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఉదయం తల్లి లేచి చూసే సమయానికి ఇంట్లో కనిపించలేదు. పైఅంతస్థు నుంచి కిందికి చూసే సరికి నేలపై బోర్లా పడుకొని ఉన్నాడు. కుడికాలు మడమ భాగం చితికిపోయి, ముఖంపై, కళ్లపై, ముక్కుభాగాల్లో తీవ్రమైన గాయాలున్నాయి. ముక్కుభాగం నుంచి రక్తం కారుతోంది. ఎక్కడో కొట్టినసమయంలో రక్తస్రావం ఎక్కువగా జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి చంపినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. తల్లి రాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

కొమురవెల్లి/శివ్వంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల వేర్వేరు కారణాలతో ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం నవాబ్ పేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నవాబ్ పేట్ గ్రామానికి చెందిన బంగారి నాగరాజు (22) పరిశ్రమకు వెళ్లేవాడు. రెండు సంవత్సరాల నుంచి పరిశ్రమకు వెళ్లకుండా మద్యానికి బానిస అయ్యాడు. ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు కావడంతో ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

కొమురవెల్లిలో మహిళ

మండల కేంద్రంలో మనస్తాపంతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొమురవెల్లి మండలకేంద్రానికి చెందిన పొట్లచెరువు రాజవ్వ(50) తన కొడుకుకు వివాహమై నాలుగు సంవత్సరాలు అవుతుంది. అయినా సంతానం కలగలేదు. దీంతో మనస్తాపంతో సోమవారం ఇంట్లో వెంటిలేటర్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొల్చారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై అహ్మద్ మొహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్ చెడు మండలం బద్రియా తండాకు చెందిన మెగావత్ టోక్య (57) ఆదివారం రంగంపేట శివారులో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి , అక్కడ నుంచి సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి డాక్టర్ల సలహా మేరకు హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం టోక్య మృతి చెందాడు. మృతుడి కుమారుడు మెగావత్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వదిన కర్మకాండ కోసం వెళ్లి..

● స్నానానికి కుంటలో దిగి..

● ప్రమాదవశాత్తు మరిది మృతి


గోపి ప్రభాకర్(ఫైల్)

రామయంపేట,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం చనిపోయిన వదిన కర్మకాండ కోసం వచ్చి స్నానానికి ఓకుంటలో దిగిన మరిది మృత్యువాత పడ్డాడు. రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్‌లో సోమవారం ఈ విషాద ఘటన జరిగింది. ఘటన వివరాలు.. గ్రామానికి చెందిన ఆశావర్కర్ పుష్పలత కాలుకు గాయమై చికిత్స పొందుతూ ఐదు రోజుల క్రితం మృతి చెందింది. సోమవారం ఆమె కర్మకాండ జరగగా, గ్రామానికి చెందిన ఆమె మరిది గోపి ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులోని కుంటలో స్నానం చేసేందుకు దిగాడు. అక్కడ ఎక్స్‌కవేటర్ గుంత ఉండటంతో అందులో మునిగిపోయాడు. అక్కడున్న వారు రక్షించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. ఐదు రోజులు వ్యవధిలో ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







గజ్వేల్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు, చేగుంట గాంధీ చౌరస్తా వద్ద రైతుల రాస్తారోకో, నర్సాపూర్‌లో ధర్నాలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్

యూరియా బాధలు.. రోడ్డెక్కిన రైతులు

గంటల తరబడి నిరీక్షించినా పంపిణీ లేక ఆగ్రహం.. ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన

నర్సాపూర్/శివ్వంపేట/రామాయంపేట/తూప్రాన్/చేగుంట/మాసాయిపేట/పెద్దశంకరంపేట/టేక్మాల్/సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/నంగునూరు/తొగుట/గజ్వేల్/రాయపోల్/కొండపాక/కుకునూరుపల్లి/హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట/కోహెడ/దౌల్తాబాద్/మిరుదొడ్డి/గుమ్మడిదల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనం, వారాంతంతో మూడు రోజుల పాటు సెలవులు రావడంతో యూరియా పంపిణీ ఆగిపోయింది. సోమవారం మళ్లీ ప్రారంభం కాగా, అన్ని చోట్ల అవే బాధలు కనిపించాయి. రైతులు ఒక్క బస్తా కోసం ఎగబడ్డారు. రైతువేదికలు, పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాలు, ఫర్టిలైజర్ షాపులకు ఉదయమే చేరుకుని పడిగాపులు కాశారు. చాలా చోట్ల సకాలంలో పంపిణీ చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెదక్ జిల్లాలో

● శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద తూప్రాన్ - సంగారెడ్డి రహదారిపై రైతులు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. పీఏసీఎస్ సీఈవో మధు యాదవ్ అక్కడికి చేరుకుని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

● రామాయంపేటతో పాటు రాయిలాపూర్‌లో సోమవారం రైతులు భారీగా క్యూ కట్టారు. మహిళలు సైతం ఇంట్లో పనులు పక్కన పెట్టి తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాశారు. పట్టణంలోని రెండుచోట్ల ఎరువులు అందజేసినా రైతులకు సరిపడా అందలేదు. రాయిలాపూర్‌లో తెల్లవారకముందే సొసైటీ వద్ద చెప్పులు వరుసలో పెట్టారు. మరికొందరు పాసుబుక్, ఆధార్ జిరాక్స్‌లు ఉంచారు.

● చేగుంట రైతువేదిక వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరారు. యూరియా రావడం లేదని ఆగ్రహించిన అన్నదాతలు గాంధీ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. దీంతో మెదక్, రామాయంపేట, హైదరాబాద్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది.

● మాసాయిపేట రైతువేదిక వద్దకు ఉదయమే పెద్దఎత్తున రైతులు చేరుకుని బారులు తీరగా, యూరియా అందించకుండా ఆలస్యం చేస్తుండడంతో ఆగ్రహించిన రైతులు నిరసనను వ్యక్తం చేశారు. 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● టేక్మాల్‌లో రెండు ఫర్టిలైజర్ షాపుల వద్ద ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. రెండు లారీల్లో యూరియా లోడ్ వచ్చినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు వారికి మద్దతు తెలిపారు.

● తూప్రాన్ పట్టణానికి చెందిన నట్రాజ్ ట్రేడర్స్ సోమవారం 300 బస్తాల యూరియా ఎరువు రాగా, రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. రైతుల నుంచి ఆధార్, రైతు పట్టదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకొని ఒక్కొక్క రైతుకు ఒక యూరియా బస్తా అందజేశారు. చాలామందికి లభించకపోవడంతో వెనుదిరిగిపోయారు.

● పెద్దశంకరంపేటలో డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచే రైతులు పెద్దఎత్తున బారులు తీరారు. 465 యూరియా బస్తాలను లైన్‌లో వేచిఉన్న రైతులకు సరఫరా చేశారు.

సిద్దిపేట జిల్లాలో

● సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడు ఆగ్రోస్ సేవా కేంద్రానికి లారీలో యూరియా లోడ్ రాగా, కేంద్రానికి వచ్చిన యూరియాను వేరే మండలానికి తరలించవద్దని, ఇక్కడే లారీ లోడ్ మొత్తం పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మెదక్-సిద్దిపేట రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఓ రైతును రూరల్ సీఐ బలవంతంగా పక్కకు తోసివేయడంతో రైతులు సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ ఆసుపత్రికి వెళ్తున్నామని, సర్టిఫికెట్లు చూపించడంతోనే వారిని పంపించాలని పక్కకు పంపించాను. కానీ వేరే దురుద్దేశంతో కాదు' అని సీఐ రైతులకు వివరించారు.

● చిన్నకోడూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి రైతులు ఉదయాన్నే చేరుకుని, మధ్యాహ్నం వరకు వేచిచూసిన పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించి, ఆందోళనకు దిగారు. ఏవో జయంత్‌కుమార్, ఎస్ఐ సైఫ్‌అలీ జోక్యంతో ముందస్తుగా టోకెన్‌లను అందజేయడంతో శాంతించారు.

● నంగునూరులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద రైతులు రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఓటీపీ విధానాన్ని రద్దు చేసి నేరుగా రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

● తొగుట సొసైటీ కార్యాలయం, ఆగ్రోస్ దుకాణం వద్ద ఉదయం నుంచే రైతులు వేచిచూశారు. 880 బస్తాల యూరియా రాగా, ఎక్కువ సంఖ్యలో రైతులు బారులు తీరడంతో ఒక్కొకరికి ఒక్క బస్తానే పంపిణీ చేశారు. దీంతో కొద్దిసేపు రైతులు ఆందోళన చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి జోక్యంతో మిగతా రైతులకు ముందస్తుగా టోకెన్‌లు అందజేశారు.

● గజ్వేల్ పట్టణంలో రైతులకు నిరాశే ఎదురుకావడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. బాబుజగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ధర్నాకు దిగారు.

● రాయపోల్‌కు ఫర్టిలైజర్ షాప్ వద్దకు ఉదయమే పెద్ద ఎత్తున రైతులు చేరుకున్నారు. చెప్పులు, ఆకులు, కొమ్మలను వరుసలో పెట్టారు. వచ్చిన యూరియా తక్కువగా ఉండడంతో సగం మందికి కూడా ఒక్కో బస్తా చొప్పున టోకెన్‌లు రాలేదు. దీంతో ఆగ్రహించి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.

● కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి, మర్పడగ, కొండపాక తదితర గ్రామాలకు యూరియా సరఫరా అయింది. విషయం తెలుసుకున్న రైతులు యూరియా కోసం బారులు తీరారు.

● కుకునూరుపల్లిలో రైతులు ఆదివారం రాత్రి నుంచే యూరియా టోకెన్‌ల కోసం రైతులవేదిక వద్ద నిద్రించారు. మరికొంత మంది 3 గంటలకు చేరుకుని క్యూలైన్‌లో వేచిఉన్నారు. తెల్లవారుజామున ఇంకొంతమంది చేరుకుని చెప్పులను వరుసలో పెట్టారు. ఉదయానికి పెద్దఎత్తున రైతులు ఉండడంతో అధికారులకు పాలుపోలేదు. ఎస్ఐ శ్రీనివాస్, ఏవో గోవిందరాజు రైతులతో మాట్లాడి ఒక్కో రైతుకి ఒక్క యూరియా బస్తా టోకెన్ మాత్రమే ఇచ్చారు. టోకెన్‌లు అందని రైతులు ఓపిక నశించడంతో రాజీవ్ రహదారిపైకి వచ్చి ధర్నా నిర్వహించారు.

● దౌల్తాబాద్‌లోని పీఏసీఎస్ కేంద్రానికి రైతులు పెద్దఎత్తున చేరుకున్నారు. ఎంతసేపటికీ యూరియా పంపిణీ చేయకపోవడంతో రైతులు గజ్వేల్ రోడ్డులోని వివేకానంద చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు.

● మిరుదొడ్డి మండలం అల్వాల రైతుల వద్ద ఆదివారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. రైతులకు యూరియాను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధర్మసమాజ్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు మండిపడ్డారు. అక్బర్‌పేటలో రైతులు రెండుగంటల పాటు రాస్తారోకోను నిర్వహించారు.



టేక్మాల్ ఆగ్రోస్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు



కుకునూరుపల్లి రైతువేదిక వద్ద నిద్రిస్తున్న రైతులు



రాయపోల్‌లో వరుసలో చెప్పులు, ఆకులు



రామాయంపేటలో ఆగ్రోస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

కావాలని కేంద్రంపై బురదజల్లే యత్నం

నర్సాపూర్‌లో యూరియా కోసం నిరీక్షించి చేసేది లేక ప్రధాన రోడ్డుపై రైతులు ఆందోళనకు దిగారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకపోవడం వల్లనే రైతులు ఇబ్బంది పడుతున్నారని, కావాలని కేంద్రంలోని బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యూరియా పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బుచ్చేస్‌యాదవ్, గోడరాజేందర్, యాదగిరి, జిల్లా కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు నగేష్, పట్టణఅధ్యక్షుడు చంద్రయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మలు దహనం



హుస్నాబాద్‌లో ప్రధాని మోదీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకే కేంద్రం యూరియా సరఫరా చేయడం లేదని నాయకులు ఆరోపించారు. రాష్ట్రానికి 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినా మోదీ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగంపల్లి ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కోహెడ అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతులు ఖాళీ సంచులతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సంగారెడ్డి జిల్లాలో

మెదక్, సిద్దిపేట జిల్లాలో ఉన్నంత యూరియా కొరత సంగారెడ్డి జిల్లాలో లేదు. అక్కడక్కడ మాత్రమే రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుమ్మడిదలలోని కోరమాండల్ కేంద్రం 600 మంది రైతులు నిరీక్షించారు. ఆధార్ కార్డు తీసుకొచ్చిన వారికి పోలీసు పహారాలో ఒక్కొక్కరికి రెండు బస్తాలు అందజేశారు. యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపు

సిద్దిపేట క్రైమ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, పార్టీ కోసం అందరూ కలిసి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని నివాసంలో రాంచందర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితిపై వారు చర్చించారు. అనంతరం వారితో రాంచందర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. నాయకులందరినీ కలుపుకుని పోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. త్వరలోనే జిల్లాలో పర్యటిస్తానని పార్టీ శ్రేణులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలగామ శ్రీనివాస్, గాడిపల్లి భాస్కర్, సింగం సత్తయ్య, బాసంగారి వెంకట్, నత్తి మల్లేష్, దేవులపల్లి మనోహర్, సురేష్, పంజా అశోక్, లక్ష్మణ్ గౌడ్, తిరుపతిరెడ్డి, పెంటయ్య, పోచయ్య, చిక్కుడు చంద్రం, నాయిని సందీప్, నరసింహులు, గుండ్ల జనార్ధన్, సంతోష్, సురేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సిగాచిపై పోరుబాట

బాధితుల పక్షాన ప్రజాసంఘాలు

ఇప్పటికీ పావువంతే పరిహారం

యజమాన్యంపై చర్యలు శూన్యం

ఉద్యమానికి సిద్ధపడుతున్న పౌరసంఘాలు

నేడు ముత్తంగిలో రౌండ్ టేబుల్ సమావేశం

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమ ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేదెన్నడో తెలియడం లేదు. దేశంలోని భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత జూన్ 30న ఇక్కడ జరిగిన ఘటనే పెద్దది. ఈ ఘటనలో 46 మంది మృతి చెందడం, ఎనిమిది మంది గల్లంతవ్వడం కలకలం సృష్టించింది. గల్లంతయిన వారితో సహా 54 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. గాయపడ్డ 28 మంది తీవ్ర అస్వస్థలతో రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముగ్గురు కార్మికులు వివిధ ఆసుపత్రులలో ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబాలన్నీ రోజు వారీ కూలీలు, తక్కువ ఆదాయ కుటుంబాల నుంచి వచ్చినవారే. వీరి జీవనోపాధి ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఇంతటి ఘోరానికి కారణమైన పరిశ్రమ యజమాన్య ప్రతినిధులపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయాల టర్నోవర్ ఉన్న కంపెనీ కనీస ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించలేదు. ఉల్లంఘనలను గుర్తించి కచ్చితంగా ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అగ్నిమాపక శాఖ అధికారులు విషయాన్నే పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన తర్వాత అన్నీ లోపాలేనంటూ నివేదికలు తయారు చేసి చేతులు దులుపుకున్నారు.

మరోవైపు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం అందిస్తానని సాక్షాత్తు సీఎం ప్రకటించినా, ఇంతవరకు యాజమాన్యం బాధిత కుటుంబాలకు కేవలం రూ. 25లక్షలే చెల్లించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కోర్టు అఫిడవిట్లో కూడా చెల్లింపుకు స్పష్టమైన కాలపరిమితి లేకపోవడంతో కార్మికులతో పాటు ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మరణించిన 15 మందికి ఇంకా మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేయకపోవడంపై కూడా ఆయా కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి.



సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడుధాటికి కూలిన శిథిలాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్లు (ఫైల్)

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

సిగాచి పరిశ్రమలో మృతిచెందిన కుటుంబాలకు మిగిలిన పరిహారం తక్షణమే అందించాలని, గాయపడిన వారికి న్యాయం చేయాలని, యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. సైంటిస్ట్స్ ఫర్ పీపుల్, మానవ హక్కుల వేదిక, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ముత్తంగి పీఎస్ఆర్ గార్డెన్‌లో ఈ సమావేశం జరగనుంది. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సైంటిస్ట్ ఫర్ పీపుల్ నాయకులు, సిగాచీ కేసు పిటిషన్ దారు డాక్టర్ కె. బాబురావు, సిగాచి పరిశ్రమపై పౌర సంఘాలు వేసిన కేసులో న్యాయవాది వసుధ నాగరాజ్, టీపీజేఏసీ కన్వీనర్ వై.అశోక్‌కుమార్, కన్నెగంటి రవి, రాష్ట్ర కో కన్వీనర్, విద్యా కమిషన్ సలహాదారుడు ఆర్.వెంకట్‌రెడ్డి, ఏపీసీఆర్ కన్వీనర్ డాక్టర్ ఉస్మాన్, మాంట్ ఫోర్ట్ సోషల్ ఇన్స్టిట్యూట్ నుంచి బ్రదర్ వర్గీస్, మానవ హక్కుల వేదిక నాయకులు రోహిత్, స్థానిక నాయకులు శ్రీకాంత్‌గౌడ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

● రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

చేగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం చేగుంట మండలంలోని చిటోజిపల్లి గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల పంట నష్టం జరిగినా, ఇప్పటివరకు ఒక్క రైతుకూ రూపాయి సహాయం అందించలేదని ఆయన మండిపడ్డారు.

ఉపరాష్ట్రపతి మాక్ పోలింగ్‌లో జహీరాబాద్ ఎంపీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సోమవారం పార్లమెంటు ఆవరణలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. అందులో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. మాక్ పోలింగ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఇండియా కూటమిని బలపరుస్తున్న ఎంపీలు, రాజ్యసభ సభ్యులు హాజరయ్యారు.



కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి పక్కన సురేష్ షెట్కార్

ఆలయాల్లో సంప్రోక్షణ

● తెరుచుకున్న గుడులు

దుబ్బాక/వర్గల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేసిన ఆలయాలు, సోమవారం ఉదయం మహా సంప్రోక్షణ అనంతరం తిరిగి తెరుచుకున్నాయి. భక్తులు దేవతా మూర్తులను దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దుబ్బాక, అక్బర్‌పేట - భూంపల్లి మండలాల్లోని అన్ని ఆలయాల్లో ఆగమోక్తంగా ఆలయ మహాసంప్రోక్షణ నిర్వహించారు. దుబ్బాకలోని నీలకంఠేశ్వరాలయం, పెద్దమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, వీరాంజనేయ ఆలయాల్లో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్బర్‌పేట - భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి కూడవెళ్లి రామలింగేశ్వరాలయంలో సాంకేత్‌శర్మ, చౌదర్‌పల్లి దుబ్బ రాజేశ్వరాలయంలో భానుశర్మలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వర్గల్ మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం, వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలు సంప్రోక్షణ అనంతరం తెరచుకున్నాయి.



కూడవెళ్లి రామలింగేశ్వరాలయంలో రామలింగేశ్వరుడికి మహాసంప్రోక్షణ చేస్తున్న అర్చకుడు

అపవాదు మాకు.. ఆర్భాటాలు మీకా?

మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎక్కడివి ?

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

సిద్దిపేట క్రైమ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష కోట్ల అవినీతి జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ కోరి, కేసీఆర్, హరీశ్‌రావులపై నిందలు మోపిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ ప్రశ్నించారు. అపవాదులు బీఆర్‌ఎస్ పార్టీకి, ఆర్భాటాలు, శంకుస్థాపనలు కాంగ్రెస్ పార్టీకా అంటూ ఆయన విమర్శించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరం కుంగిందని దుష్ప్రచారం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారని, మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి నీళ్లు తరలించే ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. రూ.7,500 కోట్లతో హైదరాబాద్ తాగునీటి పథకం కోసం మూసీ ప్రక్షాళన పేరిట గండిపేట వద్ద సీఎం శంకుస్థాపన చేయనున్నారని, కాళేశ్వరం వ్యర్థమని, నీళ్లు లేవని అబద్ధాలు పలికిన సీఎం ఇప్పుడు మల్లన్నసాగర్ నుంచి నీటిని ఎలా పంపింగ్ చేస్తారని ప్రశ్నించారు. ముందు మల్లన్నసాగర్‌లో స్నానం చేసి, కొమరవెల్లి మల్లన్న గుడిలో తప్పు ఒప్పుకొని, కేసీఆర్‌కు, తెలంగాణ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, దాని తర్వాతే మూసీ ప్రక్షాళనకు కొబ్బరికాయ కొట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమే గందమల్ల, మూసీ ప్రక్షాళనకు వచ్చే గోదావరి నీళ్లు అని సీఎం గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే అసెంబ్లీలో కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసి, సీబీఐ విచారణ డిమాండ్ చేశారని, ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మోహన్‌లాల్, చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, ప్రభాకర్ వర్మ, కొండం రవీందర్ రెడ్డి, శ్రీహరి యాదవ్, ప్యాక్స్ చైర్మన్ కనకరాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నర్సారెడ్డిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత నాయకుడిపై దాడి చేసి రెండు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన నర్సారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బాబు జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్ర మహేందర్, ఉపాధ్యక్షులు దెబ్బేట శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పై దాడి చేసిన నర్సారెడ్డిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదన్నారు. నర్సారెడ్డిపై చర్యలు తీసుకోకుంటే దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు అశోక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సుంచు రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: బీఆర్ఎస్

చిన్నకోడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పూర్తి స్థాయిలో యూరియాను పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ చిన్నకోడూరు మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆరోపించారు. చిన్నకోడూరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

ముగిసిన అర్బన్ మండల స్థాయి క్రీడలు

సిద్దిపేట కల్చరల్/మిరుదొడ్డి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన సిద్దిపేట అర్బన్ మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు సమావేశంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సౌందర్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో గత 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు ఎంఈవో అంజయ్య ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు,

సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్ పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరులను స్మరించుకుంటూ పాలక ప్రభుత్వ విధానాలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశాలు

హుస్నాబాద్‌రూరల్/మద్దూరు/కొండపాక/మిరుదొడ్డి/ సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాపై సోమవారం జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో అధికారులు వివిధ పార్టీలతో సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాపై చర్చించారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని అధికారులు నాయకులకు సూచించారు. హుస్నాబాద్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మద్దూరు ఎంపీపీ కార్యాలయంలో స్థానిక మండల పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో రాంమోహన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రాఫ్టు ఓటరు జాబితాను తెలియర్చినట్లు తెలిపారు. కొండపాక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు వివిధ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలకేంద్రంలో ఎంపీడీవో జహీరొద్దీన్ ఆధ్వర్యంలో ఆల్‌పార్టీ నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సిద్దిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి సీపీఐ పార్టీ మినహా మిగిలిన రాజకీయ పార్టీల నాయకులు గైర్హాజరైనట్టు ఎంపీడీవో వెల్లడించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

గజ్వేల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల భాను, ఆముదాల రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సమస్యలపై ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సైఫ్ అలీ సూచించారు. మండలంలోని రామంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సిద్దిపేట షీటీం బృందం సభ్యులతో కలిసి మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిద్దిపేట షీ టీం బృందం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మెరిసిన క్రీడాకారులు

- 7 బంగారు, 3 రజత పతకాలు
- పలు విభాగాల్లో జాతీయ స్థాయికి ఎంపిక



మెడల్స్ సాధించిన జిల్లాలోని యోగా క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు మూడురోజుల పాటు జరిగిన 6వ తెలంగాణ రాష్ట్ర యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ యోగాసన క్రీడా పోటీల్లో సిద్దిపేట జిల్లా యోగా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు మొత్తం 7 బంగారు పతకాలు, 3 వెండి, ఒక కాంస్య పతకాన్ని సాధించారు.

పలు విభాగాల్లో ప్రతిభ

అండర్ 14 బాలుర ట్విస్టింగ్ యోగాసనం విభాగంలో పి. వినయ్‌కుమార్ గోల్డ్‌మెడల్, ఫార్వర్డ్ బెండింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. తోట సుధాంశ్ బ్యాక్ బెండింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. వినయ్‌కుమార్, చిన్న సుధాంశ్ పెయిర్ ఆర్టిస్టిక్, అటామిక్ విభాగాల్లో బంగారు పతకాలు గెలుపొందారు. అండర్ 17 జూనియర్ బాలుర విభాగంలో ఎస్. శివకుమార్ ట్విస్టింగ్, ఆర్టిస్టిక్ సింగిల్ విభాగాల్లో 2 గోల్డ్ మెడల్స్, బ్యాక్ బెండింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. రామ్‌చరణ్ ఆర్టిస్టిక్ సింగిల్‌లో 5వ స్థానం దక్కించుకున్నాడు. అండర్ 14 బాలికల విభాగంలో నికిత, సిరి రిథమిక్ యోగా విభాగంలో 5వ స్థానం సాధించారు. లేఖ్య ట్విస్టింగ్‌లో కాంస్య పతకం గెలిచింది. జూనియర్ గర్ల్స్ విభాగంలో వెన్నెల ఆర్టిస్టిక్ సింగిల్‌లో 5వ స్థానం సాధించగా, స్వాతి బ్యాక్ బెండింగ్‌లో 5వ స్థానం, ఫార్వర్డ్ బెండింగ్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకుంది.

జాతీయస్థాయికి ఎంపిక

ఈ విజయాలతో సిద్దిపేట జిల్లాకు చెందిన ఏడుగురు యోగా క్రీడాకారులు జాతీయస్థాయికి అర్హత సాధించారు. జూనియర్ పోటీలు సెప్టెంబర్ 28 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో, సబ్ జూనియర్ పోటీలు నవంబర్ నెలలో మహారాష్ట్రలో జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయి. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, యోగ కోచ్‌లు, యోగ అభిమానులు అభినందించారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడి మాట్లాడుతూ జిల్లాలో యోగా క్రీడ మరింత విస్తృతం కావడానికి దోహదం చేస్తాయని చెప్పారు. ఈ పోటీలకు టెక్నికల్ డైరెక్టర్‌గా తోట సతీష్, టెక్నికల్ అఫీషియల్స్‌గా తోట సంధ్య, రాధిక, రజిని, కిషన్ వ్యవహరించారు. సిద్దిపేట జట్టుకు పూజ, సింధు, మనీషాలు వ్యవహరించారు.

ఈ నెల 30 వరకు సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కమ్యూనిటీ మోబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ 2025- 26 పట్ల మండల విద్యాధికారులకు, ప్రతీ మండలం నుంచి ఒక ఉపాధ్యాయుడికి అవగాహన కల్పించారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సదస్సులో రిసోర్స్ పర్సన్ చింతల శ్రీనివాస్ ఆన్‌లైన్‌లో సర్వే ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ మోబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్ మాట్లాడుతూ యూడైస్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ సర్వేలో పాల్గొనాలని తెలిపారు. ఈ నెల 30 వరకు సర్వే పూర్తి చేయాలని చెప్పారు. సర్వేలో పొందుపరిచిన వివరాలను అక్టోబరులో ఎవల్యూటర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పాఠశాలలకు రేటింగ్ ఇస్తారని తెలిపారు. త్రీస్టార్స్ కంటే ఎక్కువ వచ్చిన 8 పాఠశాలలను జిల్లాస్థాయికి, 4 స్టార్స్ సాధించిన 20 స్కూల్స్‌ని రాష్ట్రస్థాయికి, 5 స్టార్స్ సాధించిన 200 పాఠశాలలు జాతీయస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు.

ఎస్సీలపై దౌర్జన్యాలను పట్టించుకోని అధికారులు



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీఐ జాతీయ ఆర్గనైజర్ ప్రభుదాస్

సిద్దిపేట రూరల్,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలలో ఎస్సీలపై దౌర్జన్యాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ఆర్గనైజర్ కొంపల్లి ప్రభుదాస్ ఆరోపించారు. సోమవారం ఢిల్లీలో జాతీయ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, కేంద్ర మంత్రి రాందాస్ అటవలేను కలిసి ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాలపై విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. త్వరలోనే తెలంగాణలో సమీక్ష నిర్వహించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రభుదాస్ వెంట తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

జిల్లాలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



అక్షరాస్యతపై సిద్దిపేటలో విద్యార్థుల అవగాహనా ర్యాలీ

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా సోమవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనకై విద్యార్థుల్లో చైతన్యాన్ని పెంపొందించుటకు జిల్లా వ్యాప్తంగా ర్యాలీలను నిర్వహించారు. వీటితోపాటు అక్షరాస్యత ప్రాముఖ్యతపై అవగాహన కలిగించుటకు వ్యాసరచన, నినాదాలు తయారీ, పోస్టర్ డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. వివిధ మండలాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో వ్యాసరచన విభాగంలో బక్రిచెప్యాల జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని సూరం సుష్మిత, పోస్టర్ డ్రాయింగ్ పోటీలో జడ్పీహెచ్ఎస్ కొమురవెల్లి 9వ తరగతి విద్యార్థి ఎస్ నరసింహాచారి, నినాదాల తయారీలో జడ్పీహెచ్ఎస్ బక్రిచెప్యాల పదో తరగతి విద్యార్థిని మెడుదుల స్నేహ, ర్యాలీ విభాగంలో సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రథమ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు జిల్లా సెక్టోరియల్ అధికారి పి .రంగనాథ్, సిద్దిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులను వివిధ విభాగాల్లో ప్రోత్సహించి ప్రథమ స్థానాల్లో నిలిపిన గైడ్ టీచర్లు మామిడి పూర్ణచందర్ రావు, జి మహేంద్ర చారిని జిల్లా విద్యాశాఖ పక్షాన అభినందించారు.

- రాయపోల్/ చేర్యాల: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు ఆంగ్లభాష అంశాలపై ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 39మందికి జరిమానా

గజ్వేల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 39 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.39 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బాలుడిని తప్పించబోయి వ్యక్తికి గాయాలు

చేర్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బైక్‌కు అడ్డుగా వచ్చిన బాలుడిని తప్పించబోయి ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చేర్యాలలోని అంగడిబజారు చౌరస్తా వద్ద చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. చేర్యాలలో వ్యక్తిగత పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న రమేశ్ స్థానిక అంగడిబజారు క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగానే ఓ బాలుడు రోడ్డు దాటుతూ అకస్మాత్తుగా అడ్డువచ్చాడు. అతడిని తప్పించబోయిన రమేష్ బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. గాయాలపాలైన రమేశ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేధింపులు భరించలేక పోతున్నాం

- మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల వినతి

హుస్నాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం వేధింపులు భరించలేకపోతున్నాం.. ఆయనను తొలగించాలని సోమవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌కు 44 మంది పారిశుధ్య కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం విధులకు హాజరుకాని కార్మికులను ఇప్పటి వరకు తీసుకోలేదని, మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అసభ్య పద జాలంతో దూషిస్తున్నాడని ఆరోపించారు. తాము ఎంత పని చేసినా గుర్తించడం లేదని, ఇదేమిటని అడిగితే మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ బెదిరిస్తున్నాడని వాపోయారు.

ఏఎన్ఎంలకు పని భారం తగ్గించాలి



సిద్దిపేటలో జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎన్ఎంలు

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి); ఎన్‌సీడీ ప్రోగ్రాంలో స్క్రీనింగ్ టెస్టులతో పాటు ఆఫ్ లైన్, ఆన్‌లైన్ రిపోర్టుల తయారీలో తమకు పనిభారం తగ్గించాలని ఏఎన్ఎంలు కోరారు. ఈ మేరకు జిల్లాలోని పలు మండలాల్లో ఆయా వైద్యాధికారులకు ఏఎన్ఎంలు సోమవారం వినతిపత్రాలను సమర్పించారు. సిద్దిపేటలో జిల్లా వైద్యాధికారికి ఏఎన్ఎంలు వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికే ఏఎన్ఎంలపై ఎంతో పని భారం మోపుతున్నారని, దీంతో 10 నుంచి 12 గంటల పాటు పని చేయాల్సి వస్తుందని వాపోయారు. ఇంకా అదనపు భారాన్ని మోపడం సరైనది కాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా నారాయణరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారికి స్థానిక ఏఎన్ఎంలు వినతిపత్రం అందించారు.

పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ములుగు మండలం క్షీరసాగర్ వద్ద కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చేర్యాల/ములుగు/కొండపాక/వర్గల్/మద్దూరు/మర్కుక్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌లో స్థానికులు పాఠశాల ఉపాధ్యాయులకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం స్కావెంజర్ దంపతులను సన్మానించారు. ములుగు మండలం క్షీరసాగర్ వద్ద కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ మాట్లాడుతూ కొన్యాల బాల్‌రెడ్డి ఫౌండేషన్(కేబీఆర్) ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఇప్ప ఉమారాణిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. ఈ మేరకు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సోమవారం పురస్కారం అందజేశారు. వర్గల్ మండలం మజీద్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దిపడగ రమేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. సోమవారం గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కు శుభాకాంక్షలు తెలిపుతూ శాలువాతో సన్మానించారు. మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ తరపున ఎంఈవో వరదరాజులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి శాలువాపూల మాలలతో ఘనంగా సన్మానించారు. మర్కుక్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన చిన్న బ్రహ్మయ్యను, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు మధును, ఇతర ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ఇస్తూ సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసేందుకే యూరియా సరఫరా చేయని కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు రాష్ట్రానికి సరిపడా యూరియాను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సరఫరా చేయడం లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ఆరోపించారు. సోమవారం హుస్నాబాద్ మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చేరి, 42 శాతం బీసీ రిజర్వేషన్లు చేపట్టి దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందన్న కుట్రతోనే రాష్ట్రం పట్ల కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని ఎందుకు మూసివేశారని ప్రశ్నించారు. తెలంగాణాకు 11లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారయంత్రాంగం అంచనాలు పంపితే కేవలం 5లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. రాష్ట్రంలో యూరియా సంక్షోభం నెలకొంటే కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్రానికి కావలసిన యూరియాను సరఫరా చేయాలని, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని తెరిపించి యూరియా ఉత్పత్తి చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

మద్దూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేపు సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మహాసభలను భవన నిర్మాణ కార్మికులు జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.


ఎల్ఐసీ 'మ్యాడ్ మిలియన్ డే'లో మద్దూరు ఏజంట్ టాప్



గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న పోతుల వీరేశం


మద్దూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా గత జనవరి 20న మ్యాడ్ మిలియన్ డే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ మేరకు 24 గంటల్లో అత్యధిక పాలసీలు చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన అంశంలో సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రానికి చెందిన పోతుల వీరేష్ 10 పాలసీలు చేసి బెస్ట్ క్యాంపెయిన్‌గా నిలిచాడని జనగామ జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ కోటేష్ తెలిపారు. ఈ విషయమై డెవలప్‌మెంట్ ఆఫీసర్ మాట్లాడారు. ఒకే రోజు అత్యధిక పాలసీలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకున్న క్యాంపెయిన్‌లో 4.50 లక్షల మంది ఏజెంట్ల సహకారంతో 5,88,107 పాలసీలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరేష్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన కృషిలో భాగమైనందున సంస్థ తరపున ప్రశంసాపత్రాన్ని ఆదివారం జిల్లా కార్యాలయంలో అతడికి అందజేసి అభినందించినట్లు తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ వైఖరి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ వైఖరి అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు జీవనాధారం అయిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ఓ వైపు ప్రచారం చేస్తూనే మరో వైపు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకువెళ్లడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. ఆయనవెంట నాయకులు రమేశ్‌గౌడ్, కొమురయ్య, మధుసూదన్‌రెడ్డి, రామస్వామి, శివకుమార్, భాస్కర్ ఉన్నారు.





మట్టితో వినాయక ప్రతిమ, నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన కలశాలు

400 కలశాలతో మట్టి వినాయక నిమజ్జనం

- జానపద గీతాలతో హోరెత్తించిన తేజూప్రియ

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చేలా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్‌లో మహిళలు వినూత్న నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీవిఘ్నేశ్వర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణేశుడి ప్రతిమను ప్రతిష్ఠించి చోటే 400 కలశాలతో నిమజ్జనం చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా చేపట్టిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకున్నది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, హారతులు, మంగళవాద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రముఖ జానపద గాయకురాలు తెలంగాణ తేజుప్రియా తన హుషారైన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆమె పాటలకు ప్రజలు చపట్లతో స్టెప్పులేస్తూ వేదిక ప్రాంగణాన్ని హోరెత్తించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, కౌన్సిలర్లు సద్ది నాగరాజు రెడ్డి, మల్లికార్జున్, ప్రజలు పాల్గొన్నారు.





తెలంగాణ తేజూప్రియు జానపద గీతాలకు స్టెప్పులేస్తున్న చిన్నారులు, యువతులు

ఫై'నాన్సెన్స్!'

(5వ పేజీ తరువాయి)

దగ్గరికి తీసుకెళ్తున్నారు. ఆస్తుల విలువను బట్టి అప్పులిప్పిస్తున్న ఏజెంట్లు, అప్పు తీసుకున్న వారి దగ్గర, ఇచ్చిన వారి దగ్గర కూడా కమీషన్ తీసుకుంటున్నారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక వంటి పట్టణాల్లో ఈ దందాలు జోరుగా సాగుతున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

అనుమతులు లేని ఫైనాన్స్ వ్యాపారులు చేస్తున్న ఈ అక్రమ దందాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి అక్రమ ఫైనాన్స్‌ల వల్ల ప్రజలు ఆస్తులు కోల్పోవడమే కాకుండా, ప్రాణాలు కూడా కోల్పోతున్నారని, వాటిని మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్టులు

దుబ్బాక/మిరుదొడ్డి/గజ్వేల్/మద్దూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పలు మండలాల్లో మాలమహానాడు నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. కాగా దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మాలమహానాడు నాయకులు ముట్టడించారు. మాలమహానాడు నాయకులు ర్యాకం శ్రీరాంలు, కాల్వనరేష్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ, ఎమ్మెల్యే కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జీవో నెంబర్ 99ను, రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలంటూ పలు డిమాండ్లు చేశారు. అనంతరం జీవో 99 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారిని దుబ్బాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గజ్వేల్‌లో మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జాతీయ మాలమహానాడు జాతీయ కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం పాటించడం లేదని విమర్శించారు. మద్దూరు మండలంలో మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

మోదీ సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం

మద్దూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సోమవారం మండలంలోని మర్మాముల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు మోకు ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రవాస్ యోజన పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బియ్యం రమేష్, ఊట్ల రాంచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయికిరణ్, శ్రీకాంత్, ప్రవీణ్, రాజేష్ పాల్గొన్నారు.